# భద్రం కొడుకో



"ఖళ్,...ఖళ్..." అవిరామంగా దగ్గుతూనే వున్నాడు సుబ్బారావు. ఊపిరితిత్తులు రెండూ సాగి, చర్మపు డప్పులా మారి ప్రతి దగ్గూ భీకరమైన ఢమరుకపు చప్పుడులా వుంది. దగ్గిన ప్రతిసారీ శరీరం అల్లల్లాడి పోతుంది. శరీరంలోని ప్రాణశక్తులన్నీ భయంతో వేసిన పెనుకేకలా వుంది అతని దగ్గు. కిటికీలోని దగ్గు మందు సీసా ఖాళీగా దిగులుగా చూస్తుంది. టి.బి. సెంటరు వాళ్ళు ఇచ్చిన బిళ్ళలు కూడా అయిపోయాయి. పది రోజుల కొకసారి ఇస్తారు మందు బిళ్లలు. పది రోజులు కాకుండా ముందే వెళితే అసహ్యంగా వికృతంగా చూస్తుందానర్సు. "అప్పుడే బిళ్ళలు అయిపోయాయా? మింగావా? ఏదైనా మందుల షాపులో అమ్ముకొన్నావా? తేరగా వస్తే ఫినాయిల్ అయినా తాగేముఖం నువ్వు! రేపురా!" అంటూ అమర్యాదగా తిడుతుందా నర్సు. ఆ నర్సుకు భయపడి వెళ్ళవలసిన రోజుకంటే రెండు రోజులు ఆలస్యంగా వెళతాడు సుబ్బారావు. "కంటిన్యుటీ లేకపోతే జబ్బు ఎలా తగ్గుతుంది?" డాక్టరు విసుక్కుంటాడు.

"ఖళ్ ఖళ్.." ప్రేక్షకులు లేని ఆడిటోరియంలో ఒంటరిగా కచేరి చేస్తున్న విద్వాంసుడిలా సుబ్బారావు దగ్గుతూనే వున్నాడు. గుంటూరు పట్టణంలో నలభై రూపాయిల అద్దెకు ఏపాటి గది వస్తుందో ఊహించుకోవచ్చు. ఆరడుగుల మనిషి కాళ్ళు చేతులు ఫ్రీగా వదిలేసి పడుకుంటే ఎంత స్థలం ఆక్రమిస్తాడో సరిగ్గా అంత వుంటుందా రూము. గాలి, వెలుతురు రాని గది. కిటికీలు, వెంటిలేటర్లు లాంటివి లేవు. ఒకే ఒక్క తలుపు. ఆ తలుపూ మూస్తే అదో సమాధిలా వుంటుంది. దూరం నుంచి వింటే సమాధిలోంచి ఆత్మ చేసే భీకరమైన రోదనలా వుంటుంది సుబ్బారావు దగ్గు.

దగ్గు, టి.బి., సమాధిలాంటి గది ప్రాపించక ముందు అమ్మా, నాన్న ఒక పల్లెటూరు. మంచి మార్కులు తెచ్చుకొని నలుగురితో శభాష్ అనిపించుకొన్న హైస్కూలు చదువు, నునులేత మీసాల, కరకుబారిన కంఠపుతొలి యవ్వనపు విశృంఖలత, చాటుగా సిగిరెట్లు, సెకండ్ షో సినిమాలు, కారణం తెలియని విసుగు, రూపం లేని కోరికలతో నిండిన ఇంటర్మీడియట్ రోజులు. కమ్మని కలలు, అమ్మాయిల స్నేహం కోసం వెంపర్లాట, చీర కొంగు చూడగానే కళ్ళలో పొంగే కామపు బుసబుసలు, యాక్సిడెంట్‌లో తల్లిదండ్రుల హఠాన్మరణంతో మధ్యలోనే ఆగిపోయిన డిగ్రీ చదువు మొదలైన దశల ద్వారా ప్రయాణించాడు సుబ్బారావు.

వీధిలోని జనం వచ్చిన కొత్తలో సుబ్బారావును వింతగా క్యూరియాసిటీతో చూసే వాళ్ళు. తరువాత్తరువాత నిర్లిప్తంగా చూసేవాళ్ళు. ఇప్పుడు నిట్టూర్పులతో చూస్తున్నారు. సుబ్బారావు కంటే సుబ్బారావు దగ్గు ముందు రంగ ప్రవేశం చేస్తుంది. హఠాత్తుగా మనమధ్య జారిపడ్డ పిడుగులా మనల్ని ఎలర్ట్ చేస్తుందా దగ్గు. కాళ్ళ పక్కన తచ్చాడే కుక్కపిల్లను ఉపేక్షించినట్లే సుబ్బారావు దగ్గును ఉపేక్షించాలని నిర్ణయించుకొన్నారా వీధిజనం. అయితే ఒక అసౌకర్యం లాంటి భావన సుబ్బారావు దగ్గు రూపంలో ఆ వీధిని పీడిస్తూనే వుంటుంది. సుబ్బారావు దగ్గు తాకిడికి బెదిరిపోయి, సీతాపతి అనే స్కూలు టీచరు సుబ్బారావును జిల్లా టి.బి. సెంటరుకు తీసుకెళ్ళి పరీక్ష చేయించాడు. బాగా ముదిరిన రెండు ఊపిరి తిత్తుల టి.బి.గా నిర్ధారణ చేశాడు డాక్టరు. సుబ్బారావు ఆ వార్తను సాదరంగా స్వీకరించినా వీధిమాత్రం ఉలిక్కిపడింది. సుబ్బారావు ట్రీట్‌మెంటు పూర్తిగా తీసుకొనేటట్లు చేసే బాధ్యత వీధి మొత్తం ఏకగ్రీవంగా స్వీకరించింది. సుబ్బారావు ఉద్యోగం వేట పేరుతో రోడ్ల వెంటతిరగకుండా పదో పాతికో చేతిలో పెడుతుంటారు. సుబ్బారావు తన సమాధిలో శవంలా మునగ దీసుకుని రామకోటిలాగ దగ్గుకోటి జపిస్తూ పడుకుంటాడు, రాత్రి పగలు.

* * *

పక్షుల అరుపులు, కూరగాయలు అమ్మే వాళ్ల కేకలు, కాలింగ్ బెల్ కొట్టి 'పాల ప్యాకట్లండోయ్' అంటూ అరిచే మిల్కుమైడ్స్, ట్రింగ్, ట్రింగ్ పేపరు బాయ్‌ల సైకిల్ బెల్లు మోతలు- రాత్రి అబ్‌స్ట్రాక్ట్ నుంచి నిశ్శబ్దం నుంచీ హఠాత్తుగా ఊడిపడ్డ ఉదయపు శబ్ద కాలుష్యంలో సుబ్బారావు దగ్గు కలిసిపోయి వీధి కాసేపు సుబ్బారావును మర్చిపోయింది. హఠాత్తుగా మారుతీకారు సుబ్బారావు వుండే గది ముందు ప్రత్యక్షం కావడం వీధిలో ఆశ్చర్యార్థకమైన నిశ్శబ్దం ఏర్పడి, ఆ నిశ్శబ్దంలో సుబ్బారావు దగ్గు మళ్ళీ అవిరామంగా ధ్వనించడము మొదలు పెట్టింది. మారుతీకారు లోంచి దిగిన స్థూల కాయం వడివడిగా సుబ్బారావు గదివైపు అడుగులు వేసింది. స్టెతస్కోపూ మెడికల్ కిట్ తోటి ఒక డాక్టరూ ఆయన్ను అనుసరించి ఆ గదివైపు వెళ్ళాడు. "ఎవరు మీరు?" సుబ్బారావు ఆశ్చర్యం, దగ్గ మిళితమైన కంఠంతో అడిగాడు. డాక్టరు ముందుకు వచ్చి "సుబ్బారావుగారు! ఐయామ్ డాక్టరు అరుణ్ కుమార్. కొత్తపేట పోస్టాఫీసు దగ్గర వున్న అరుణా పాలీ క్లినిక్ నాదే.

ఈయన రామతారకం అని మున్సిపల్ కౌన్సిలర్. గొప్పదాత. ఈయన సహకారంతో ఒక అరుదైన ఆరోగ్య పథకాన్ని మా హాస్పటల్‌లో ప్రారంభిస్తున్నాము. ప్రతి నెలా ఒక అనాథ పేషెంటు ట్రీట్‌మెంటుకు అయ్యేఖర్చు అంతా ఆయన భరిస్తాడు. అపోలో, మెడ్విన్‌లకు సమానమైన ఫైవ్‌స్టార్ ట్రీట్‌మెంట్ నీకు అందిస్తాము. ఈ నెల అనాథ పేషెంటుగా నిన్ను సెలెక్ట్ చేశాము. టి.బి. సెంటరు వాళ్ళు నీ అడ్రస్ ఇచ్చారు. సో, యువార్ వెరీ లక్కీ!" అంటూ అయిదు నిమిషాలు సీరియస్‌గా సుబ్బారావుని పరీక్ష చేసి, దీర్ఘంగా నిట్టూర్చి "పరిస్థితి చాలా తీవ్రంగా వుంది. వెంటనే హాస్పటల్‌కు తరలించాలి" అన్నాడు రామతారకం వైపు సాలోచనగా చూస్తూ.

ఆ పాటికి వీధి క్యూరియాసిటీ నుంచి తేరుకుని సుబ్బారావు గది ముందు మూగింది. అబ్సర్డ్ డ్రామాలా ఏమీ అంతు పట్టడం లేదు వాళ్ళకు. పిల్లికి బిచ్చం వేయని రామతారకం అక్కడ ప్రత్యక్షం కావడం, సుబ్బారావుకు ఫ్రీగా ట్రీట్‌మెంట్ ఇప్పిస్తాననడం, అంతా మిస్టరీగా వుంది వాళ్ళకు.

* * *

ఫైవ్ స్టార్ హొటల్ లాంటి డా.అరుణ్ కుమార్ పాలీ క్లినిక్. ఎ.సి.రూమ్‌లో పడుకొన్న సుబ్బారావు అనూహ్యమైన ఆనందంతో థ్రిల్‌గా వున్నాడు. ఇలాంటిదేదో అద్భుతం జరిగి తీరుతుందని అతని ప్రగాఢ విశ్వాసం. కాస్త ఆలస్యమయినా సరే ఏదో ఒక రోజు "ప్రిన్సెస్ ఛార్మింగ్" తనంతట తానే ఎదురు వచ్చి అతని మెడలో వరమాల వేస్తుందని అతని గట్టి నమ్మకం. ఇలాంటి అద్భుతమైన సంఘటనలు గతంలో కూడా చాలా జరిగాయి అనడానికి దాఖలాలున్నాయి. చిన్నప్పుడొకసారి హైస్కూలు వార్షికోత్సవాల్లో అతని పేరు చదివి, స్టేజీ పైకి ఆహ్వానించి లెక్కల్లో ఫస్ట్ వచ్చిందని అతని చేతిలో ఒక ప్రైజ్ పెట్టారు. అలాంటివే సంఘటనలు జరిగాయి కాలేజీ డేస్‌లో. కూడా ఇప్పుడిది మరో అసాధారణమైన అద్భుతం. లేకపోతే దమ్మిడీ సంపాదన లేని నిరుద్యోగి సుబ్బారావుకు ఫైవ్‌స్టార్ ట్రీట్‌మెంటా? డివైన్ మిరకిల్ కాకపోతే మరేమిటి? సుబ్బారావు తన అదృష్ట జాతకానికి మురిసిపోయాడు.

నెల రోజుల పాటు అతి ఖరీదైన ఇంజక్షన్‌లతో, టాబ్లెట్లతో ట్రీట్‌మెంట్ జరిగింది సుబ్బారావుకు. నెల రోజులు అయినాక మళ్ళా ఎక్సరేలు, కళ్ళి పరీక్ష చేసి "పర్‌ఫెక్టలీ ఆల్‌రైట్! కాకపోతే ఆపరేషను కూడా చేస్తే మళ్ళీ ఎప్పటికీ టి.బి.రాదు" అని డాక్టరు చెప్పిన మీదట ఆపరేషనకు సిద్ధమయ్యాడు సుబ్బారావు. ఆ నెల రోజులూ రామతారకం రోజుకొకసారైనా సుబ్బారావును కలుస్తూనే వున్నాడు. పాలు, పళ్ళు, ఖరీదైన ఆహారం అతనికి సమకూరుస్తూనే వున్నాడు. ఆపరేషన్ రోజు చాలా హడావుడి చేశాడు రామతారకం. "బ్లడ్ అవసరమైతే నేనిస్తాను డాక్టర్" అంటూ ముందుకు వచ్చాడు. "అవసరం లేదు బ్లడ్ బ్యాంక్‌లో కావలసినంత స్టాకుంది" అంటూ డాక్టరు ఆయన్ను వారించాడు. ఆపరేషను విజయవంతంగా పూర్తయింది. వారం రోజులయినాక అన్ని జాగ్రత్తలూ చెప్పి సుబ్బారావును

డిశ్చార్జి చేశారు. మారుతీ కారులోనే భద్రంగా సుబ్బారావును ఇంటి దగ్గర వదిలి పెట్టాడు రామతారకం. ఖర్చుల కంటూ ఒక వెయ్యి రూపాయిలు చేతిలో పెట్టి మరీ వెళ్ళాడు.

* * *

రెండు నెలల తరువాత ఒక రోజు రోడ్డుపై నడిచి వెళుతూ హఠాత్తుగా దబ్బుమని నేలపై పడ్డాడు సుబ్బారావు. ఏదో భూతం ఆవహించినట్లు శరీరం నిస్సత్తువగా అయిపోయింది. పైకి లేవలేక పోయాడు. ఒళ్ళంతా నీరు పట్టి నీటి మూటలా మారి శరీరం అతని ఆజ్ఞలకు రెస్పాండ్ కావడం లేదు. భూమి అక్కడికక్కడే చీలి, ఆ లోయలోకి తను మెల్లమెల్లగా జారిపోతున్నట్టుగా అనిపిస్తుంది. అంతా అయిపోయినట్టుగా అనిపిస్తుంది. ఎంతో దిగులు వేసి 'అమ్మా' అన్నాడు. ఆ పిలుపు ఎద్దు కాళ్ళ క్రింద నలిగిన వానపాము నీరసపు కేకలా వుంది. జలజలారాలాయి కళ్ళ వెంట నీళ్ళు. బాధతోనో, భయంతోనో లేక మరే కారణంతోనో వెక్కి వెక్కి ఏడ్వాలని ప్రయత్నించాడు. ఆ వెక్కిళ్ళ మధ్యే క్రమంగా మగతలోకి జారాడు.

మగతలోనే ఎన్నో దృశ్యాలు. కలలాగ జరిగి పోతున్నాయి. ఇద్దరు మనుష్యులు సాయం పట్టి రిక్షాలో చేర్చడం, హాస్పటల్, క్యాజువాలిటీ వార్డు, జబ్బలో పదునుగా దిగుతున్న నీడిల్. పరీక్ష చేస్తున్న డాక్టర్లు. "వాటీజ్ దిస్? ఈ స్కార్ ఏమిటి? ఇతనికి కిడ్నీ ట్రబుల్ ఏమైనా వుందా?" "అలాంటి దేమీ లేదు సార్! ఇతనో క్రానిక్ టి.బి. పేషెంటు. డా.అరుణ్ కుమార్‌గారు ట్రీట్‌మెంటు ఇచ్చారు ఈ మధ్యనే. ఏదో ఆపరేషన్ కూడా చేశారు." "ఆపరేషనా? మరి ఈస్కార్ ఏమిటి? సమ్‌థింగ్‌రాంగ్, స్కానింగ్ తీయిద్దాం." స్కానింగ్ రూమ్‌వైపు పరుగులు. పది నిమిషాలు గడిచాక "ఓ మై గాడ్! ఎంత మోసం. ఇతని ఒక కిడ్నీ తీసివేశారు. రెండో కిడ్నీ ఇన్‌ఫెక్ట్ అయి 'రీనల్ ఫెయిల్యూర్' వచ్చింది. బ్రతకడం చాలా కష్టం". అంత వరకే విన్నాడు సుబ్బారావు. మగత అతన్ని పూర్తిగా కమ్మివేసింది.

• ఆంధ్రజ్యోతి వారపత్రిక, 4 సెప్టెంబర్ 1992 •